

## హృతిక్ గ్రేస్ ఇష్టం

***బాలీవుడ్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన పూజాహెగ్డే టాలీవుడ్‌లో హాట్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. తాజాగా వరుస అవకాశాలతో హిందీ సినిమాల్లో తన సత్తా చాటుతున్నది. సినిమాల్లోకి రావడం గొప్పగా భావిస్తున్నానని చెబుతున్న పూజ తన ఇష్టాలను ఇలా పంచుకుంది..***

**జీవితమంటే:** కలలు, జ్ఞాపకాల సమాహారం.

**పూజ ఎలాంటి అమ్మాయి:** నాకు ఆశలూ ఎక్కువే, ప్రాక్టికల్‌గానూ ఆలోచిస్తాను. ఎమోషనల్‌గా కూడా ఉంటాను.

**గొప్పగా ఫీలైన సందర్భం:** సినిమా ఇండస్ట్రీకి రావడం. మంచి పాత్రలు లభించినప్పుడల్లా గొప్పగా భావిస్తాను.

**డ్రీమ్ కో-స్టార్ అంటే ఎవరి పేరు చెబుతారు:** రణ్‌బీర్‌కపూర్, ఆల్‌టైమ్ లెజెండ్ అమితాబ్ సార్.

**నచ్చిన సినిమాలు:** దేవదాసు, మొఘల్-ఎ-ఆజమ్, చాందినీ, లా లా ల్యాండ్

**హృతిక్ రోషన్‌లో మెచ్చేది:** అతని గ్రేస్

**అక్షయ్ కుమార్ అంటే..:** ఫిట్‌నెస్, పంక్చువాలిటీ

**రణ్‌వీర్‌సింగ్ నుంచి నేర్చుకున్నది..:** అనుకున్నది చెప్పేయడం

**మగవాళ్లు ఎలా ఉంటే ఇష్టం:** తమ చుట్టూ ఉన్నవారిని గౌరవించేవాళ్లంటే ఇష్టం.

## • ఓ తండ్రి తపన

లోకేశ్ కనకరాజ్, కార్తీ కాంబినేషన్‌లో వచ్చిన సినిమా ఖైదీ! యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకున్నా.. ఇందులో కూతురు సెంటిమెంట్ అబ్బురపరుస్తుంది. కూతురు ముఖం కూడా చూడకుండానే జైలుకు వెళ్లిన తండ్రి ఏడేండ్ల తర్వాత జైలు నుంచి విడుదల అవుతాడు. అనాథాశ్రమంలో ఉన్న కూతురిని చూడాలనుకుంటున్న తండ్రి ఊహించని విధంగా ఓ పోలీస్ ఆపరేషన్‌లో భాగం కావాల్సి వస్తుంది. వరుసగా చేజింగ్ ఎపిసోడ్స్ వస్తున్నా.. హీరో తన బిడ్డను ఎప్పుడు కలుసుకుంటాడన్న ఆరాటం ప్రేక్షకుల్లో మొదలవుతుంది. తన బిడ్డను ఎప్పుడెప్పుడు చూస్తానా అని పరితపించిన హీరో.. తెల్లారేదాకా బతికుంటాడో, లేడో అనే స్థితికి చేరుకుంటాడు. యాక్షన్, సెంటిమెంట్ మేళవింపుగా కథను నడిపించి ప్రేక్షకులను కట్టిపారేశాడు దర్శకుడు. సినిమా అంతా అంతర్లీనంగా సాగిపోయే కూతురును కలవాలన్న తండ్రి తపనే 'ఖైదీ' విజయానికి ప్రధాన కారణం.




నమస్తే తెలంగాణ

# జిందగీ II

హైదరాబాద్ | ఆదివారం 17 డిసెంబర్ 2023 www.ntnews.com


# కథకు పసివాడే ప్రాణం!

**కథే.. హీరో! ఒకప్పటి సినిమా సూత్రం! హీరోనే.. కథ! ఇప్పటి కమర్షియల్ ఫార్ములా. దేన్ని ఎంచుకున్నా.. హీరోయిజాన్ని పండించడానికి అందమైన హీరోయిన్, బలమైన విలన్ కంపల్సరీ! దీంతోపాటు చైల్డ్ సెంటిమెంట్‌ను సినిమా సక్సెస్ మంత్రంగా ఎంచుకున్న సందర్భాలు కోకొల్లలు. చిన్నారుల చుట్టూ తిరిగే కథతో రూపొందిన సినిమాలు అడపాదడపా వెండితెరపై కాసుల వర్షం కురిపించాయి. అయితే, ఇటీవల పసివాడి పాత్రలు మళ్లీ బలంగా ప్రాణం పోసుకుంటున్నాయి. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చిన్నారి చుట్టూ కథను నడిపిస్తూ.. బాక్సాఫీస్ దగ్గర విజయాన్ని అందుకుంటున్నారు దర్శక, నిర్మాతలు.**

**సాదాసీదా** కథలతో సినిమాలు తీస్తే సక్సెస్‌పై నమ్మకం లేకుండా పోతున్న రోజులు వచ్చేశాయి. అందుకే కొత్త దర్శకులు కొంగొత్త కథలను ఎంచుకుంటున్నారు. హీరో ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని కమర్షియల్ హంగులన్నీ జతచేసినా, విభిన్నమైన మూలకథను ఎంచుకొని, దానిని చిన్నపిల్లలతో ముడిపెడుతున్నారు. పరోక్షంగా ఉంటూనే ప్రధాన కథను నడిపించే బాధ్యతను ఆ పిల్లల భుజాన వేస్తున్నారు. ఇవి కమర్షియల్‌గా సక్సెస్ సాధించడంతో ఈ తరహా కథలకు మరింత పదును పెడుతున్నారు. గతంలోనూ పిల్లల సెంటిమెంట్ సినిమాలు కోకొల్లలు వచ్చాయి. 1954లో ఎన్టీఆర్ హీరోగా వచ్చిన 'రాజు-పేద' మొదలుకొని యేటా ఈ తరహా చిత్రాలు ఒకట్రెండు ప్రేక్షకులను పలకరించాయి! చిరంజీవి హీరోగా వచ్చిన 'పసివాడి ప్రాణం' పిల్లల సెంటిమెంట్‌ను మరోస్థాయికి తీసుకెళ్లింది. విజయశాంతి కథానాయికగా వచ్చిన 'రేపటి పౌరులు' సినిమాను అప్పట్లో స్కూలు పిల్లలకు ప్రత్యేక షో వేసి చూపించారు కూడా! అయితే, ప్రధాన కథకు అనుబంధంగా మరో స్క్రీన్‌ప్లే రన్ చేస్తూ వండర్స్ క్రియేట్ చేస్తున్నారు నేటి దర్శకులు.

* * *

నాని హీరోగా ఇటీవల వచ్చిన సినిమా 'హాయ్ నాన్న'. ఇందులోనూ చైల్డ్ సెంటిమెంట్ హృదయాన్ని హత్తుకుంది. అమ్మానాన్నల ప్రేమకథను కూతురి ద్వారా నడిపించి సరికొత్త ప్రయోగం చేశాడు దర్శకుడు శౌర్యువ్. తండ్రి, కూతుళ్ల అనుబంధం విజువల్ ఫీస్ట్‌గా ఉండటంతో 'హాయ్ నాన్న'కు మంచి మైలేజ్ వచ్చింది. తాజాగా వెంకటేష్ హీరోగా రూపొందుతున్న 'సైంధవ్' సినిమా టీజర్‌లోనూ తండ్రీకూతుళ్ల అనుబంధం కనిపిస్తుంది. గన్స్ మాఫియాను వైరిపక్షంగా చూపించినా, టీజర్ ఎండింగ్‌లో తండ్రీకూతుళ్లను ఒకే ఫ్రేమ్‌లో చూపించి.. ఈ సినిమాలో రెండో కోణం ఉందని చెప్పకనే చెప్పాడు దర్శకుడు శైలేష్. 'హిట్' ఫ్రాంచైజీ సినిమాలతో హ్యాట్రిక్ హిట్ దర్శకుడిగా పేరు తెచ్చుకున్న శైలేష్ ఈ చిత్రాన్ని యాక్షన్ కమ్ సెంటిమెంట్‌గా తెరకెక్కించాడని టీజర్ చూస్తే తెలుస్తున్నది.





## • మనవడి కోసం పోరాటం

చాలారోజుల తర్వాత కమల్ హాసన్‌కు కమర్షియల్ విక్టరీని ఇచ్చిన సినిమా విక్రమ్. లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ప్రధాన కథ డ్రగ్స్ మాఫియాను మట్టుబెట్టడం. అయితే, దీనికి అనుబంధంగా తాత, మనవడి కథ కనిపిస్తుంది. కొడుకును కోల్పోయిన తండ్రిగా, తండ్రిలేని తన మనవడిని కాపాడుకునే తాతగా కమల్ నటన ఆద్యంతం అద్భుతంగా ఉంటుంది. మాదకద్రవ్యాల ముప్పు నుంచి ముందుతరాలను కాపాడాలన్నది మూలకథ. ఇందులో ముందు తరానికి ప్రతినిధిగా ఓ పసివాణ్ని ఎంచుకున్నాడు దర్శకుడు. ఆ చిన్నారిని రక్షించే బాధ్యతను తాత పాత్రకు అప్పగించి మిగిలిన కథనంతా కమర్షియల్ పంథాలో నడిపించాడు. యాక్షన్ సీక్వెన్స్‌లకు దీటుగా ఈ తాతా మనవల సెంటిమెంట్ ప్రేక్షకులకు కనెక్ట్ అయింది. అందుకే సినిమా సూపర్ హిట్ అయింది.

## •అడవి బిడ్డ చుట్టూ..

వరల్డ్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన చిత్రం ఆర్ఆర్ఆర్. రాజమౌళి, ఎన్టీఆర్, రామ్‌చరణ్ చేసిన ఈ మాయాజాలం మూలకథ ఓ అడవిబిడ్డను రక్షించడమే! కుమ్రం భీమ్, అల్లూరి సీతారామరాజు పాత్రలతో కాల్పనిక చారిత్రక కథగా దీన్ని తెరకెక్కించాడు రాజమౌళి. కానీ, వీరిద్దరినీ ఒక్కతాటిపైకి తేవడానికి ఓ చిన్నారి పాత్రను ఎంచుకున్నాడు. ఆదిలాబాద్ అడవికి వచ్చిన బ్రిటిష్ దొర దంపతులు అక్కడి చిన్నారిని తమతోపాటు బలవంతంగా తీసుకెళ్తారు. ఆమెను కాపాడటానికి భీమ్ రంగంలోకి దిగుతాడు. ఢిల్లీకి వెళ్లిన భీమ్‌కు రామరాజు సాయం చేయడం, ఇద్దరూ కలిసి పాపను విడిపించడం మిగిలిన కథ! తెర మీద హీరోలిద్దరూ ఎన్ని విన్యాసాలు చేసినా.. ప్రధాన కథంతా పాప చుట్టూనే తిరుగుతుంది.

## • హీరోకు దీటుగా..

ఏడాది కిందట కార్తీ ద్విపాత్రాభినయంతో వచ్చిన సినిమా 'సర్దార్'. నీటి కాలుష్యం, ప్లాస్టిక్ బాటిల్స్‌లో వాటర్ ప్యాకింగ్ వల్ల కలిగే అనర్థాలను ఈ సినిమా కండ్లకు కట్టింది. ప్రధాన కథకు అనుబంధంగా ఉన్న ఓ పిల్లాడి పాత్ర అందరినీ ఆకట్టుకుంటుంది. క్యాన్సర్ బాధిత బాలుడు హీరో జర్నీలో కీలకంగా మారుతాడు. హీరో తండ్రితో స్నేహం చేస్తాడు. హీరో పాత్రను డామినేట్ చేసేంతగా ఆ చిట్టి పాత్రను డిజైన్ చేశాడు దర్శకుడు పీఎస్ మిత్రన్! ఆ బుడతడిగా మాస్టర్ రిత్విక్ పెర్ఫార్మెన్స్‌కు థియేటర్‌లో ఈలలు వేశారంటే ఆ పాత్ర ఎంత ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చు. మొత్తంగా సర్దార్ సక్సెస్‌లో ఈ చిట్టి పాత్రకు సింహభాగం వాటా ఉందంటే అతిశయోక్తి కాదు.

ఓటీటీ హిట్

## దోషులు ఎవరు?



**వ్యూహం** (వెబ్‌సిరీస్)

**ప్రైమ్ వీడియో: డిసెంబర్ 14**

**నటీనటులు: సాయి సుశాంత్ రెడ్డి, చైతన్య కృష్ణ, పావని గంగిరెడ్డి, రవీంద్ర తదితరులు**

**దర్శకత్వం: శశికాంత్ పీసపాటి**

**'సస్పెన్స్, సెంటిమెంట్** ఒక ఒరలో ఇమడవు' అని సినీ ప్రాథమిక సూత్రం. ఈ ఫార్ములాను అతిక్రమించి ఆసక్తికరమైన వెబ్‌సిరీస్‌లు నిర్మిస్తున్నారు దర్శకులు. శశికాంత్ పీసపాటి దర్శకత్వంలో రూపొందిన 'వ్యూహం' రికార్డు స్ట్రీమింగ్ సొంతం చేసుకుంటున్నది. ఎనిమిది ఎపిసోడ్స్‌గా తయారైన 'వ్యూహం' కథలోకి వెళ్తే.. ఐపీఎస్ అధికారి అర్జున్ రామచంద్ర (సాయి సుశాంత్ రెడ్డి) కొత్తగా విధుల్లో చేరుతాడు. అతని తల్లి వాణి ఐపీఎస్‌గా సేవలు అందిస్తుంది. అర్జున్ పదేండ్లు ఉన్నప్పుడు తన ముందే ఆమెను నక్సలైట్లు కాల్చి చంపుతారు. తల్లిని స్ఫూర్తిగా తీసుకున్న అర్జున్ పోలీసు అధికారి అవుతాడు. ఇదిలా ఉండగా మైఖేల్ (చైతన్య కృష్ణ), జెస్సికా (పావని గంగిరెడ్డి) భార్యాభర్తలు. గర్భిణిగా ఉన్న జెస్సికను చెకప్ కోసం హాస్పిటల్‌కు తీసుకెళ్తుంటే ఒక కారు వాళ్లను ఢీ కొడుతుంది. ఇద్దరికీ తీవ్రగాయాలు అవుతాయి. జెస్సికా గర్భం కోల్పోతుంది. పోలీసులు మామూలు హిట్ అండ్ రన్ కేసుగా తేల్చేస్తారు. అయితే, మైఖేల్ మాత్రం ఒప్పుకోడు. అర్జున్‌ను కలుస్తాడు. ప్రమాదం జరగడానికి ముందు కూడా వరుసగా మూడుసార్లు ఎవరో తమను అటకాయించారని చెబుతాడు. ఇది మామూలు హిట్ అండ్ రన్ కేసు కాదని దీనివెనుక ఏదో కుట్ర కోణం ఉందని గ్రహిస్తాడు అర్జున్. ఈ కేసు పరిశోధనలో ఉండగానే ఓ జర్నలిస్ట్ దారుణహత్యకు గురవుతుంది. ఆమె హత్యకు, యాక్సిడెంట్ కేసుకు ఏదైనా లింక్ ఉందా, ఇంతకీ మైఖేల్‌ను టార్గెట్ చేసిన వాళ్లు ఎవరు? వాళ్ల వెనుక ఎవరున్నారు? ఈ కేసును రామచంద్ర ఎలా పరిష్కరించాడన్నది మిగిలిన కథ.

## గో..గోవా!



**కరోనా దెబ్బతో** రెండేండ్లు స్తబ్ధుగా ఉన్న పర్యాటకానికి 2023 మంచి ఊపునిచ్చింది. ప్రకృతి ప్రేమికులు విహారం పేరుతో కడలి అంచులకు చేరుకుంటే, సాహస వీరులు కొండకోనలను ఎంచుకున్నారు. ముఖ్యంగా భారతీయ యాత్రికులు వినూత్న పర్యాటకులమని నిరూపించుకున్నారు. ఇంటిల్లిపాదీ చర్చించి గూగుల్‌లో సెర్చించిన టాప్ టెన్ పర్యాటక ప్రదేశాల వివరాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేశాయి. భారతీయులు ఆసక్తి కనబర్చిన ప్రదేశాల్లో వియత్నాం మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఆ తర్వాతి ప్లేస్‌ను గోవా ఆక్రమించింది. అరబిక్ కడలి అందాలతో కుర్రకారుకు కూతవేటు దూరంలో ఉన్న స్వర్గం గోవా. స్వదేశంలో విదేశీ పర్యటన అనుభవం పొందాలనే లక్ష్యం ఉన్నవాళ్లంతా గో.. గోవా అనడంతో గూగుల్ మీటర్‌లో ఈ డెస్టినేషన్ రెండో ప్లేస్‌ను దక్కించుకుంది. ఆధ్యాత్మికత, ఆహ్లాదం అడుగడుగునా పరుచుకున్న బాలి మూడో స్థానాన్ని దక్కించుకుంది. పట్టుతప్పిన అంతర్గత వ్యవహారాలతో కొట్టుమిట్టాడిన శ్రీలంక పర్యాటకులను అలరించడంలో ఇప్పటికీ ముందుంది. ఈ జాబితాలో సింహళ దేశానిది నాలుగో స్థానం. దేహజాడ్యాన్ని తోకముడిపించే డెస్టినేషన్ థాయ్‌లాండ్. గూగుల్ జాబితాలో ఈ దేశం ఐదో ప్లేస్‌లో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో మన దేశంలోని సుందర ప్రదేశాలు చోటు దక్కించుకున్నాయి. హిమగిరి సొగసులతో కట్టిపడేసే కశ్మీర్ ఆరు, పడమటి కనుమల్లో సుందర జలపాతాలతో అలరారే కూర్గ్ ఏడో స్థానంలో నిలిచాయి. నిండు సముద్రంలో మెండైన పచ్చదనంతో బెస్ట్ డెస్టినేషన్‌గా పేరున్న అండమాన్ నికోబార్ 8వ ర్యాంకు సాధించింది. యూరోపియన్ దేశాలైన ఇటలీ, స్విట్జర్లాండ్ తొమ్మిది, పది స్థానాల్లో నిలిచాయి.



# కంటి నిండా నిద్రపోతా!

**తన అభినయంతో బాలీవుడ్‌లో స్టార్‌డమ్ తెచ్చుకున్న నటి దీపికా పదుకొణె. రణ్‌వీర్‌తో జీవితాన్ని పంచుకున్న ఈ పొడుగుకాళ్ల సుందరి పెండ్లయ్యాక కూడా కెరీర్‌లో దూసుకుపోతున్నది. స్కిన్‌కేర్ ప్రొడక్ట్‌తో ఆంత్రప్రెన్యూర్‌గా మారింది. ఒకవైపు సినిమాలు, మరోవైపు బిజినెస్ పనులు చక్కబెడుతూ అతివకు అన్నీ సాధ్యమే అని నిరూపిస్తున్నది. తను ఎంత బిజీగా ఉన్నా.. నిద్రాహారాల విషయంలో జాగ్రత్తగా ఉంటానని చెబుతున్న దీపికా పంచుకున్న అనుభవాలు ఆమె మాటల్లోనే...**

**గ్లామర్** ఫీల్డ్‌లో ఉన్నందుకు ఆహార నియమాలు పాటించాల్సిందే! రుచుల కోసం వెంపర్లాడితే సమస్యలు తప్పవు. అలాగని నేనేం నోరు కట్టుకొని ఉండను. రకరకాల రుచులు ఆస్వాదిస్తాను. పండ్లముక్కలు, కూరగాయల జ్యూస్‌తో బ్రేక్‌ఫాస్ట్ అయిందనిపిస్తాను. మధ్యాహ్నం లంచ్‌లోకి బ్రౌన్ రైస్, పప్పు, ఒకటి రెండు కర్రీస్‌తోపాటు ప్రొటీన్ పదార్థాలు ఉండేలా చూసుకుంటాను. సాయంత్రం స్నాక్స్ తప్పకుండా తీసుకుంటాను. రాత్రి అన్నం చాలా పరిమితంగా తింటాను. జర్నీలో ఉన్నప్పుడు ఎక్కువ జాగ్రత్తగా ఉంటాను. డైట్ రూల్స్ పాటిస్తాను.

**ఆరోగ్యంగా ఉండాలంటే** తీవ్ర సాధనలు చేయాల్సిన అవసరం లేదు. రొటీన్ వర్కవుట్లు చాలు అనిపిస్తుంది. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే.. కంటినిండా నిద్ర ఉండాలి. అప్పుడు ఒత్తిడి దరి చేరకుండా ఉంటుంది. నిద్ర, ఆహారం ఈ రెండే నేను పాటించే ఫిట్‌నెస్ సూత్రాలు.

**నా షెడ్యూల్ ఎంత బిజీగా ఉన్నా..** నిద్రకు కేటాయించిన సమయం తక్కువ కాకుండా చూసుకుంటా. సమయం ఉన్నరోజు తొమ్మిది గంటలు పడుకుంటా. రెగ్యులర్‌గా అయితే కనీసం ఏడు గంటలు, గరిష్ఠంగా ఎనిమిది గంటలు హాయిగా నిద్రపోతా. అంతసేపు పడుకుంటాను కదా.. తెల్లారేసరికి ఒత్తిళ్లన్నీ పరారైనట్టు అనిపిస్తుంది.

**ఒక్కరోజులో** ఏదో సాధించేస్తాం అనుకుంటే పొరపాటు. నిబద్ధతతో పనిచేస్తూ ఉంటే సక్సెస్ వస్తుంది. ఏదైనా సాధించాలంటే ఓపిక చాలా అవసరం. ఆటుపోట్లు ఎదురైనప్పుడు వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి. అన్నిటికన్నా కమిట్‌మెంట్ చాలా ముఖ్యం. గెలుపు వచ్చినప్పుడు పొంగిపోయినా, ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోయినా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేం.

**సోషల్ మీడియాలో** రకరకాల రాతలు వస్తూ ఉంటాయి. వాటన్నిటి గురించి ఆలోచిస్తూ కూర్చుంటే మనం అడుగు ముందుకు వేయలేం. శిక్షణ సమయంలో క్రీడాకారులకు ఫోకస్డ్‌గా ఉండమని చెబుతుంటారు. సామాజిక మాధ్యమాల నెగెటివిటీ ప్రభావం మనపై పడకూడదంటే చాలా ఫోకస్డ్‌గా ఉండాలి. పుకార్లను ఖండిస్తూ పోతే.. మనకంటూ సమయం మిగలదు.